# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

శనివారం | 5 జూలై 2025 | పేజీలు 8


# అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు పెరిగే అవకాశం ఉంది...

## శ్రేణులు సిద్ధంగా ఉండాలి

- నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లు రాబోతున్నాయన్న రేవంత్
- 2029 ఎన్నికల నాటికి కొత్త నాయకత్వం సిద్ధం కావాలని వ్యాఖ్య
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపు



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో రాబోయే పదేళ్లు కాంగ్రెస్ పార్టీదే అధికారమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లు వంటి కీలక మార్పులు రాబోతున్నాయని, వాటికి అనుగుణంగా కొత్త నాయకత్వం ఎదగాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గాంధీ భవన్‌లో జరిగిన టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో జమిలి ఎన్నికలు, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలు వంటివి రాజకీయాలను ప్రభావితం చేయనున్నాయని తెలిపారు. దీనివల్ల అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు పెరిగే అవకాశం ఉందని, ఈ అవకాశాలను అందిపుచ్చుకుని 2029 ఎన్నికల నాటికి నూతన నాయకత్వం సిద్ధంగా ఉండాలని సూచించారు. యువ నాయకులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో కష్టపడాలని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో చురుకైన పాత్ర పోషించాలని కోరారు. పార్టీ పదవులను తేలిగ్గా తీసుకోవద్దని, వాటితోనే రాజకీయంగా గుర్తింపు, గౌరవం లభిస్తాయని,

-2 లో

# 50 ఏళ్లలో ఒక్క బీసీనైనా సీఎం చేశారా?

## కాంగ్రెస్‌పై బండి సంజయ్ ఫైర్

- రాష్ట్ర కేబినెట్ లో బీసీలకు తగినన్ని మంత్రి పదవులు ఇవ్వలేదని విమర్శ
- ఆరు గ్యారెంటీల అమలులో విఫలమయ్యారని మండిపాటు
- ప్రజలు బీజేపీవైపు మొగ్గు చూపుతున్నారని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్ పార్టీ నిర్వహించ తలపెట్టిన సభపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ సభ పేరును 'సామాజిక అన్యాయ సమర భేరి'గా మార్చుకోవాలని ఎద్దేవా చేశారు. ఏ అర్హతతో కాంగ్రెస్ పార్టీ సమర భేరి నిర్వహిస్తోందని ఆయన నిలదీశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, "50 ఏళ్లకు పైగా దేశాన్ని పాలించిన

-2 లో

# మళ్లీ 90 సీట్లతో మాదే అధికారం

## టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ధీమా

- గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కీలక వ్యాఖ్యలు
- రాష్ట్రంలో మళ్లీ 90 సీట్లతో అధికారంలోకి వస్తామని ధీమా
- సామాజిక న్యాయానికి కట్టుబడి పదవుల పంపిణీ జరిగిందని వెల్లడి
- స్థానిక ఎన్నికలే లక్ష్యంగా 'సామాజిక న్యాయ సమరభేరి' సభ
- సభకు హాజరుకానున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో మళ్లీ 90 స్థానాల్లో గెలిచి అధికారం నిలబెట్టుకోవడం ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని, దాంతోనే ప్రజల మద్దతు తమకు లభిస్తుందని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో శుక్రవారం జరిగిన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తుందని చెప్పడానికి పదవుల పంపణీనే నిదర్శనమని అన్నారు. అగ్రవర్ణ నేతకు ముఖ్యమంత్రి పదవి, బీసీ వర్గానికి చెందిన తనకు పీసీసీ అధ్యక్ష పదవి, నలుగురు దళితులకు మంత్రివర్గంలో స్థానం, మరో దళిత నేతకు స్పీకర్ పదవి ఇవ్వడమే దీనికి నిదర్శనమని ఆయన వివరించారు.

-2 లో

### బీజేపీజాతీయ అధ్యక్షురాలిగా మహిళా నేత?...

# రేసులో ముగ్గురు, సౌత్ నాయకులకే చాన్స్!

- పరిశీలనలో నిర్మలా సీతారామన్ పేరు
- దగ్గుబాటి పురంధేశ్వరి, వానతి శ్రీనివాస్ పేర్లు కూడా
- మహిళా నేతకు పట్టం కట్టే దిశగా కమలనాథులు

**హైదరాబాద్ పెన్ పవర్:** బీజేపీ జాతీయ అధ్యక్ష పదవిని ఈ సారి మహిళా నేతలకు కట్టబెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మేరకు ఆర్‌ఎస్‌ఎస్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. దక్షిణాది రాష్ట్రాల్లో తమ బలం పెంచుకునేందుకు ఇక్కడి మహిళా నేతనే ఎన్నుకోనున్నట్లు సమాచారం. 2023 జనవరి నాటికే జేపీ నడ్డా పదవీ కాలం ముగిసింది. 2024లో లోక్‌సభ ఎన్నికల కారణంగా జూన్ వరకు నడ్డా పదవీకాలం పొడిగించారు. అయితే ఇప్పటికీ ఆయనే జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. త్వరలోనే జాతీయ అధ్యక్ష పదవిని కొత్త వారికి అప్పగిస్తారని తెలుస్తోంది. ఈ క్రమంలో దక్షిణాదికి చెందిన ముగ్గురు నేతల పేర్లు తెరపైకి వచ్చాయి. మహిళా కీలక నేతలైన నిర్మలా సీతారామన్, పురుందేశ్వరి, వనతి శ్రీనివాసన్ పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే నిర్మల సీతారామన్.. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా,

-2 లో






## బీజేపీజాతీయ అధ్యక్షురాలిగా మహిళా నేత?... రేసులో ముగ్గురు, సౌత్ నాయకులకే చాన్స్!

- మొదటి పేజి తరువాయి

జనరల్ సెక్రటరీ బీఎల్ సంతోష్‌తో సమావేశమయ్యారు. నిర్మలా సీతారామన్ రేసులో ముందున్నట్టు ప్రచారం జరుగుతోంది. నిర్మల జాతీయ అధ్యక్షురాలిగా ఎన్నికైతే బీజేపీ దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ ప్రభావం పెరిగే అవకాశం ఉంటుందని పార్టీ భావిస్తోంది. నిర్మలా సీతారామన్ గతంలో రక్షణశాఖ మంత్రిగా సేవలందించారు.
ప్రస్తుతం ఆర్థిక మంత్రిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. పార్టీలోనూ ఆమెకు సంపూర్ణమైన మద్దతు ఉందని తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ బీజేపీ మాజీ అధ్యక్షురాలు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కూతురు పురంధేశ్వరి పేరు కూడా బీజేపీ జాతీయ అధ్యక్షురాలి పదవికి పరిశీలనలో ఉన్నట్టు సమాచారం.
ఇటీవల ఆపరేషన్ సిందూర్ ప్రతనిధి బృందానికి కూడా ఆమె సెలెక్ట్ అయ్యారు. ఏపీ బీజేపీకి కీలక నేతగా ఉన్నారు. తమిళనాడు చెందిన మహిళా నేత, న్యాయవాది వనతి శ్రీనివాస్ పేరు కూడా బీజేపీ జాతీయ అధ్యక్ష పదవికి పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. ఆమె 1993 లో బీజేపీలో చేరారు. బీజేపీ తమిళనాడు సెక్రటరీ, జనరల్ సెక్రటరీ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు.

## మళ్లీ 90 సీట్లతో మాదే అధికారం

- మొదటి పేజి తరువాయి

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా 'సామాజిక న్యాయ సమరభేరి' పేరిట భారీ సభను నిర్వహించనున్నట్లు మహేశ్ గౌడ్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతారని, గ్రామ స్థాయి పార్టీ అధ్యక్షులకు ఆయన దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. పార్టీ కొత్తగా పదవులు ఇచ్చిన నేతలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు పెరిగే అవకాశం ఉంది... శ్రేణులు సిద్ధంగా ఉండాలి

- మొదటి పేజి తరువాయి

భవిష్యత్తు ఎదుగుదలకు అవి పునాది వేస్తాయని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం విద్య, ఉద్యోగ రంగాల్లో ఎన్నో విజయాలు సాధించిందని, దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి జనగణనలో కుల గణనను చేర్చేలా చేయడంలో విజయం సాధించామని గుర్తుచేశారు. పార్టీ శ్రేణులంతా మల్లికార్జున ఖర్గేను స్ఫూర్తిగా తీసుకుని, సమష్టిగా పనిచేసి రెండోసారి కూడా కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

# 50 ఏళ్లలో ఒక్క బీసీనైనా సీఎం చేశారా?

- మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ పార్టీ ఒక్క బీసీ నేతకైనాప్రధాని పదవి ఇచ్చిందా? కనీసం ఒక్క బీసీనైనా ముఖ్యమంత్రిని చేసిందా?" అని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు కేబినెట్‌లో ఎన్ని మంత్రి పదవులు కేటాయించారని ఆయన నిలదీశారు. పొన్నం ప్రభాకర్‌కు మంత్రి పదవి ఇవ్వడంతో బీసీల గొంతు వినిపిస్తోందని, అలాంటప్పుడు మిగతా బీసీలకు ఎందుకు అవకాశమివ్వలేదని అన్నారు. ఇచ్చిన 6 గ్యారంటీలను కూడా అమలు చేయడంలో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు.
రాష్ట్రంలో యూరియా కొరత అంశంపై కూడా బండి సంజయ్ స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని, ఇది చూసి ఓర్వలేకే కాంగ్రెస్ ప్రభుత్వం యూరియా కొరత పేరుతో డ్రామాలు ఆడుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే ఈ తరహా రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రం అడిగిన దానికంటే అదనంగా యూరియా సరఫరా చేసేందుకు కేంద్రం సానుకూలంగా ఉందని, ఈ వాస్తవాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలని ఆయన కోరారు.

## మహబూబ్‌నగర్ వద్ద పట్టాలు తప్పిన గూడ్స్ రైలు..

# రైళ్ల రాకపోకలకు అంతరాయం

- మహబూబ్‌నగర్ సమీపంలో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు
- బోయపల్లి గేట్ వద్ద ఆరో బోగీ ట్రాక్ నుంచి పక్కకు
- రామగుండం నుంచి తమిళనాడు వెళుతుండగా ఈ ఘటన
- మహబూబ్‌నగర్-కర్నూలు మార్గంలో నిలిచిన రైళ్ల రాకపోకలు
- మూడు గంటలకు పైగా నిలిచిపోయిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు



**హైదరాబాద్ పెన్ పవర్:**మహబూబ్‌నగర్–కర్నూలు రైల్వే మార్గంలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మహబూబ్‌నగర్ శివారులోని బోయపల్లి గేట్ వద్ద గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో సుమారు మూడు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ కారణంగా చెంగల్‌పట్టు, హంద్రీ, మైసూర్, సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్‌లతో సహా పలు రైళ్లు మార్గమధ్యంలోనే నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
రామగుండం నుంచి తమిళనాడుకు సరుకుతో వెళుతున్న గూడ్స్ రైలు బోయపల్లి గేట్ వద్దకు రాగానే దాని 6వ నెంబరు బోగీ పట్టాలు తప్పింది. ఈ విషయాన్ని వెంటనే గమనించిన లోకో పైలట్ అప్రమత్తమై రైలును నిలిపివేశారు. అప్పటికే పట్టాలు తప్పిన బోగీ సుమారు 20 మీటర్ల దూరం వరకు సిమెంట్ స్లీపర్ల మీదుగా ప్రయాణించి, ట్రాక్‌ను దెబ్బతీసింది.
ఈ ఘటనతో మహబూబ్‌నగర్–కర్నూలు మార్గంలో రైళ్ల రాకపోకలు స్తంభించాయి. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మరమ్మతు పనులను చేపట్టేందుకు కాచిగూడ నుంచి ప్రత్యేకంగా యాక్షన్ రిలీఫ్ ట్రైన్‌ను రప్పించి, ట్రాక్ పునరుద్ధరణ పనులు ప్రారంభించారు.

## కాంగ్రెస్ సభతో హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలు..

# గంటల తరబడి రోడ్లపైనే నగరవాసులు

- హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ 'సామాజిక న్యాయ సమర భేరి' సభ
- సభ కారణంగా నగరంలో పలుచోట్ల భారీ ట్రాఫిక్ జామ్
- కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలతో వాహనదారుల ఇక్కట్లు
- లక్డీకాపూల్, మాసబ్‌ట్యాంక్, పంజాగుట్ట, నాంపల్లిలో తీవ్రమైన రద్దీ

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ నగరంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'సామాజిక న్యాయ సమర భేరి' సభ కారణంగా నగరవాసులు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎల్బీ స్టేడియంలో జరిగిన ఈ సభకు కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సభ ముగిసిన అనంతరం నగరం మొత్తం ట్రాఫిక్‌తో స్తంభించిపోయింది. సాయంత్రం వేళ ఇళ్లకు, ఇతర గమ్యస్థానాలకు వెళ్లే వాహనదారులు గంటల తరబడి రోడ్లపైనే నిలిచిపోయి తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ భారీ సభ నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ముందుగానే ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సాయంత్రం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నగరంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఎల్బీ స్టేడియం పరిసర ప్రాంతాలైన లక్డీకాపూల్, మాసబ్‌ట్యాంక్, పంజాగుట్ట, రవీంద్రభారతి, నాంపల్లి వంటి మార్గాల్లో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ముఖ్యంగా
సచివాలయం, ఇందిరా పార్క్ నుంచి లక్డీకాపూల్ వైపు వెళ్లే మార్గంలో ఉదయం నుంచే రద్దీ మొదలైంది. ఏఆర్ పెట్రోల్ పంప్ నుంచి బీజేఆర్ విగ్రహం వైపు వెళ్లే వాహనాలను, సుజాత స్కూల్ లేన్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను నాంపల్లి వైపు మళ్లించారు. రవీంద్రభారతి నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను కూడా నాంపల్లి మీదుగా పంపించారు. పంజాగుట్ట, ఖైరతాబాద్ ఫ్లైఓవర్, బషీర్‌బాగ్, అబిడ్స్, ఎంజే మార్కెట్ వంటి రద్దీ ప్రాంతాల వైపు రావొద్దని, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని పోలీసులు వాహనదారులకు సూచించారు.

## ఈడీ విచారణపై స్పందించిన

# నిర్మాత అల్లు అరవింద్

- అరవింద్‌ను మూడు గంటల పాటు ప్రశ్నించిన ఈడీ అధికారులు
- ఓ ప్రాపర్టీలో మైనర్ వాటాదారుడి భాగాన్ని కొనుగోలు చేసినట్లు అల్లు అరవింద్ వెల్లడి
- మైనర్ వాటాదారుడు బ్యాంకు నుంచి రుణం తీసుకొని చెల్లించలేదన్న అరవింద్
- అకౌంట్స్ బుక్‌లో తన పేరు ఉండటం వల్ల ఈడీ విచారణకు పిలిచిందని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:**ఈడీ విచారణపై ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ స్పందించారు. 2017లో ఓ ప్రాపర్టీలో ఒక మైనర్ వాటాదారుడి భాగాన్ని తాను కొనుగోలు చేశానని ఆయన తెలిపారు. ఆ ప్రాపర్టీకి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి కొన్ని సమస్యలు ఉన్నాయని ఆయన అన్నారు. ఆ మైనర్ వాటాదారుడు బ్యాంకు నుంచి రుణం తీసుకొని చెల్లించలేదని ఆయన పేర్కొన్నారు.అకౌంట్స్ బుక్‌లో తన పేరు ఉండటం వల్ల ఈడీ విచారణకు పిలిచిందని ఆయన వెల్లడించారు. బాధ్యత గల పౌరుడిగా తాను విచారణకు హాజరయ్యానని తెలిపారు. ఈడీ అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చానని అల్లు అరవింద్ తెలియజేశారు.ప్రముఖ నిర్మాత, గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్‌ను ఈడీ అధికారులు ఈరోజు విచారించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌కు చెందిన రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ సంస్థకు సంబంధించిన రూ.101 కోట్ల బ్యాంక్ రుణ మోసం కేసులో ఆయనను సుమారు మూడు గంటల పాటు ప్రశ్నించి, వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు.

## నిద్రపోవడమే ఇంటర్న్ షిప్... రూ.9.1 లక్షలు గెలుచుకున్న యువతి!

**హైదరాబాద్ పెన్ పవర్:**ఉద్యోగం చేసి డబ్బు సంపాదించడం అందరికీ తెలుసు. కానీ, కేవలం నిద్రపోయి లక్షలు సంపాదించవచ్చని నిరూపించింది పుణెకు చెందిన ఓ యువతి. యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న పూజా మాధవ్ వావల్, ఓ వినూత్న పోటీలో గెలుపొంది ఏకంగా రూ.9.1 లక్షల నగదు బహుమతిని సొంతం చేసుకున్నారు.ప్రముఖ మ్యాట్రెస్ సంస్థ 'వేక్‌ఫిట్' ఏటా నిర్వహిస్తున్న 'స్లీప్ ఇంటర్న్‌షిప్' నాలుగో సీజన్‌లో పూజ విజేతగా నిలిచారు. దేశవ్యాప్తంగా వచ్చిన లక్షకు పైగా దరఖాస్తుల నుంచి 15 మందిని ఫైనలిస్టులుగా ఎంపిక చేశారు. వీరందరికీ 60 రోజుల పాటు రోజూ 9 గంటలు తప్పనిసరిగా నిద్రపోవాలనే టాస్క్ ఇచ్చారు. వారి నిద్ర నాణ్యతను కాంటాక్ట్‌లెస్ స్లీప్ ట్రాకర్ల ద్వారా పర్యవేక్షించారు.ఈ పోటీలో పాల్గొన్న 15 మందికీ సంస్థ తలా రూ.లక్ష చొప్పున చెల్లించింది. అయితే, అందరిలోకి అత్యుత్తమంగా, క్రమశిక్షణతో నిద్రపోయిన పూజా మాధవ్ 91.36 స్కోరుతో 'స్లీప్ ఛాంపియన్ ఆఫ్ ది ఇయర్'గా నిలిచారు. దీంతో ఆమెకు అదనంగా భారీ మొత్తంలో నగదు బహుమతి లభించింది. ఈ పోటీలో కళ్లు మూసుకుని బెడ్ సర్దడం, అలారం క్లాక్‌లను వెతకడం వంటి సరదా టాస్కులు కూడా నిర్వహించారు.

# 42 దేశాలు తిరిగిన మోడీకి.. మణిపూర్ వెళ్లే తీరిక లేదా: ఖర్గే





**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రధాని మోడీపై ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఫైర్ అయ్యారు. 42 దేశాలు తిరిగానని గొప్పలు చెప్పుకునే మోడీ.. అల్లర్లతో అట్టుడికిన మణిపూర్‌కు ఎందుకు వెళ్లడం లేదు..? మణిపూర్ వెళ్లే తీరిక లేదా..? లేక మణిపూర్ భారత్‌లో అంతర్భాగం కాదా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. శుక్రవారం (జూలై 4) ఎల్బీ స్టేడియంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభ నిర్వహించింది. ఈ సభకు మల్లికార్జున ఖర్గే చీఫ్ గెస్ట్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా కేంద్రం చేపట్టిన ఆపరేషన్ సిందూర్?కు కాంగ్రెస్ మద్దతు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా ఉంటామని ఆల్ పార్టీ మీటింగ్?లో కాంగ్రెస్ పార్టీ వైఖరి స్పష్టంగా చెప్పాం. కానీ కీలకమైన ఆల్ పార్టీ మీటింగ్ కు ప్రధాని మోడీ హాజరు కాలేదు. మేం దేశం కోసం ఆలోచిస్తుంటే మోడీ ఎన్నికల కోసం చూస్తున్నారు.

మోడీకి బీహార్ ఎన్నికలపై ఉన్న శ్రద్ధ దేశ భద్రతపై లేదు. పాకిస్తాన్ ను అంతం చేస్తామని గొప్పలు చెప్పిన బీజేపీ నేతలు.. యుద్ధాన్ని మధ్యలో ఎందుకు ఆపారు..? ఇందిరాగాంధీ పాకిస్థాన్ ను రెండు ముక్కలు చేశారు.. మరీ మోడీ ఏం చేశారు. దేశం కోసం ప్రాణాలు ఇవ్వడానికి కాంగ్రెస్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది.గాంధీ కుటుంబంలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన వాళ్లు ఉన్నారు.. మరీ బీజేపీ దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ లో అలాంటి వాళు ఉన్నారా..? పాక్, భారత్ యుద్ధం ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదే పదే అంటుంటే మీరు ఎందుకు నోరు మూసుకున్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని మోడీ ఎందుకు స్పందించడం లేదు. అమెరికాకు వ్యతిరేకంగా ఇందిరా పోరాడింది. ఇందిరా గాంధీ ఎవరికి తలవంచలేదు.. యుద్ధంలో చూసుకుందామని సవాల్ చేసింది. మోడీ పాలనలో భారత్?కు మిత్ర దేశాలు అన్ని దూరమయ్యాయి" అని ప్రధాని మోడీపై నిప్పులు చెరిగారు మల్లికార్జున ఖర్గే.

# కల్వకుంట్ల గడీలు బద్దలు కొట్టింది కాంగ్రెస్ కార్యకర్తలే: సీఎం రేవంత్





**హైదరాబాద్ పెన్ పవర్:**కల్వకుంట్ల కోటల బద్దలు కొట్టింది కాంగ్రెస్ కార్యకర్తలేనని.. కార్యకర్తల కృషితోనే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం (జూలై 4) హైదరాబాద్?లోని ఎల్బీ స్టేడియంలో టీపీసీసీ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ సమరభేరి సభ జరిగింది. ఈ సభకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఇదే ఎల్బీ స్టేడియంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిందని గుర్తు చేశారు. మా ప్రభుత్వం మాణాళ్ల ముచ్చేటనని అన్నారు.

సంక్షేమ పథకాలు ఎక్కువ రోజులు అమలు చేయలేరని అన్నారు. కాంగ్రెస్ వాళ్లు కలిసి ఉండలేరని.. వాళ్లకు వాళ్లే కొట్టుకుంటున్నారని ప్రచారం చేశారు. కానీ నవ్వినోడి ముందే తలెత్తుకునేలా పాలన చేస్తున్నామని కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే కుల గణన చేసి సామాజిక న్యాయానికి శ్రీకారం చుట్టామన్నారు. తెలంగాణలో దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించుకుంటూ ముందుకు సాగుతున్నామని.. కలిసి కట్టుగా ముందుకెళ్తూ అందరి అపోహాలు పటాపంచలు చేశామన్నారు.

తెలంగాణలో తమకు తిరుగులేదని విర్రవీగిన బీఆర్ఎస్?ను దెబ్బకొట్టామన్నారు. మూడు రంగుల జెండా పట్టి రాష్ట్రంలోని నాలుగు కోట్ల మందిని చైతన్య పరిచామని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పినట్లుగానే అధికారంలోకి రాగానే కులగణనతో పాటు ఎస్సీ వర్గీకరణ చేశామని గుర్తు చేశారు. ఫిబ్రవరి 4ను సోషల్ జస్టిస్ డేగా జరుపుకుంటున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల కష్టాలు.. ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకుని ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు.

# దేశం షాక్ అయ్యింది : కొరియర్ అంటూ వచ్చాడు.. సాఫ్ట్ వేర్ ఉద్యోగినిపై పెప్పర్ స్ప్రే చల్లి అత్యాచారం

**హైదరాబాద్ పెన్ పవర్:** క్రైమ్ సినిమాలు చూసి యూత్ చెడిపోతుంది అంటుంటారు. కానీ ఒక్కోసారి ఇలాంటి వాళ్లను చూసిన తర్వాతే క్రైమ్ కథలు రాసుకుంటారేమో డైరెక్టర్లు అనిపిస్తుంది. ఎందుకంటే ఇంత కరుడుగట్టిన నేరగాళ్లు మన మధ్య తిరుగుతూ.. గుట్టు చప్పుడు కాకుండా చేయాల్సిన నేరాలను చేసేస్తున్నారు. అందర్లో ఉన్నప్పుడు మంచి వారిలా నటిస్తూ.. లోలోపల తల్లిదండ్రులు కూడా 'ఉరి తీయండి నా కొడుకుని' 'అది నా కూతురు కాదు.. చంపేయండి' అని అసహ్యించుకునేలా చేస్తున్నారు ఈ దుర్మార్గులు.

అది పదకొండో అంతస్తు.. అమ్మాయి ఒంటరిగా ఉంటుందని ఎప్పుడు రెక్కీ నిర్వహించాడో. డెలివరీ బాయ్ లాగా వెళ్లి.. మేడం మీకు పార్సిల్ వచ్చింది.. అంటూ ఫ్లాట్ లోకి ఎంటరయ్యాడు. నేను ఆర్డర్ చేయలేదే.. అంటూనే డోర్ ఓపెన్ చేసింది. లోపలికి వెళ్లిన దుండగుడు.. ఆమె ముఖంపై స్ప్రే కొట్టి అత్యంత కిరాతకంగా దారుణానికి పాల్పడ్డాడు. పైగా ఫోటోలు తీసి.. ఆ అమ్మాయి కనపడకుండా క్రాప్ చేసిన ఇమేజ్ చూపిస్తూ.. ఎవరికైనా చెప్తే సోషల్ మీడియాలో షేర్ చేస్తా.. నీ బతుకు బస్టాండే అని చెప్పి వెళ్లి పోయాడు. ఈ దారుణ ఘటన పుణెలో జరిగింది.

పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. పుణె కొంధ్వా ఏరియాలోని ఓ రెసిడెన్సీలో ఉండే 22 ఏళ్ల యువతి డేటా సైన్స్ లో ఇంజినీరింగ్ చేస్తూ.. కళ్యాణినగర్ లోని ఐటీ కంపెనీలో సాఫ్ట్ వేర్ గా పనిచేస్తోంది. 2022 నుంచి తన తమ్ముడితో ఆ రెసిడెన్సీలోని




11వ ఫ్లోర్ లో రెంట్ కు ఉంటున్న ట్లు ఆ సొసైటీకి సంబంధించిన వ్యక్తి చెప్పారు. పదకొండు అంతస్తుల బిల్డింగ్ ను %ూ, దీ, జ% వింగులుగా విభజించి, ఎప్పుడూ ఇద్దరు సెక్యూరిటీలు ఉండేలా ఏర్పాటు చేశారు. అందులో ఏ వింగ్ కు వెళ్లాలన్నా ఒకే ఎంట్రెన్స్ నుంచి వెళ్లాలి. అలాంటి బిల్డింగ్ లోకి సెక్యూరిటీకి మాయమాటలు చెప్పి.. 11వ ఫ్లోర్ కు వెళ్లి దారుణానికి పాల్పడటం సంచలనంగా మారింది. అకోలా కు చెందిన అక్కా తమ్ముడు.. జాబ్ కోసం పుణెకు షిఫ్ట్ అయ్యారు. తమ్ముడు తిరిగి అకోలా వెళ్లడంతో ఒంటరిగా ఉంటుంది ఆ యువతి. అయితే ఎప్పట్నుంచి నిఘా ఉంచాడో.. ఎప్పుడు రెక్కీ నిర్వహించాడో కానీ.. క్రైమ్ సినిమాలో లాగే దారుణానికి పాల్పడినట్లు 4వ జోన్ డీసీపీ రాజ్ కుమార్ షిండే చెప్పారు.

**సైన్ చేసేందుకు పెన్ను తెచ్చేలోపే:**

"బుధవారం (జులై 02) సాయంత్రం 7.15 గంటలకు డోర్ బెల్ మోగింది. మేడం మీకు బ్యాంకు నుంచి పార్సిల్ వచ్చిందని డెలివరీ బాయ్ కనిపించాడు. డెలివరీ రిసీప్ట్ మీద సైన్ చేయాలని.. పెన్ను మర్చిపోయాను అని చెప్పాడు. పెన్ను తెద్దామని ఇంట్లోకి వెళ్తుంటే వెంటనే డోర్ క్లోజ్ చేసి.. నా ముఖంపై ఏదో కెమికల్ స్ప్రే చేశాడు." అని యువతి చెప్పినట్లు డీసీపీ తెలిపారు. "ఆ తర్వాత ఆ యువతి 8.30 కు స్పృహలోకి వచ్చింది. తనపై అత్యాచారానికి పాల్పడినట్లు గుర్తించింది. వెంటనే వాళ్ల బంధువులకు ఫోన్ చేయగా అందరూ వచ్చి జరిగిన ఇన్సిడెంట్ గురించి తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. మెడికల్ పరీక్షల కోసం ఆమెను ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాం. ఆమె ముఖంపై చల్లిన స్ప్రే ఏంటో ఫోరెన్సిక్ నిపుణులు పరిశీలిస్తున్నారు. కొంధ్వా పోలీస్ స్టేషన్ నుంచి 10 టీమ్ లను రంగంలోకి దింపాం. నిందితుడిని పట్టుకునేందుకు క్రైమ్ బ్రాంచ్ కూడా పనిచేస్తోంది" అని డీసీపీ చెప్పారు.

బుధవారం ఘటన జరిగిన రెసిడెన్సీకి 10 మంది డెలివరీ బాయ్స్ వెళ్లినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిర్ధారించారు విచారణ అధికారులు . వారిని విచారించనున్నట్లు తెలిపారు. అయితే డెలివరీ బాయ్ గా వచ్చిన నిందితుడు.. విజిటర్స్ రిజిస్టర్ లో వివరాలు ఎంట్రీ చేయకుండానే ఫ్లాట్ కు వెళ్లినట్లు విచారణలో తేలింది.

రెసిడెన్సీలో కనీసం నాలుగైదు ఆర్డర్స్ డెలివరీ చేసే బాయ్.. యువతి రూమ్ కు వెళ్లినట్లు నిర్ధారించారు. ఎందుకంటే కాంప్లెక్స్ లోకి ఎంట్రీ అయినప్పుడు ఒక్కసారి సంతకం చేస్తే సరిపోతుంది. ప్రతీ డెలివరీకీ సంతకం అవసరం లేదు. అందుకే ఎంట్రీ అయినప్పుడే సైన్ చేసి.. అన్ని వింగ్స్ లో ఆర్డర్స్ డెలివరీ చేస్తూ.. చివరికి యువతి ఫ్లాట్ కు వెళ్లినట్లు నిర్ధారించారు.

డెలివరీ బాయ్స్ అంటే.. మనం ఆర్డర్ చేసింది ఇచ్చేసి వెళ్తారులే అనే ఆలోచనలో ఉంటాం. కానీ ఇలాంటి డెలివరీ బాయ్స్ కూడా ఉంటారు. ఫ్లాట్స్ లో ఒంటరిగా ఉండే మహిళలు ఇలాంటి విషయంలో చాలా కేర్ ఫుల్ గా ఉండాల్సిందేనని అంటున్నారు పోలీసులు. మనుషుల్లో ఉండే మానవ మృగాల నుంచి జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు.

# ఆ ఇద్దరితో చాలా డేంజర్.. రాయచోటి టెర్రరిస్టులపై బిగ్ అప్డేట్

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో ఇటీవల ఉగ్రవాదుల అరెస్టులు సంచలనమవుతున్నాయి. విజయనగరం పేలుళ్లకు స్థానికుడు సిరాజ్ ప్రణాళిక వేయడం, కౌంటర్ ఇంటెలిజెన్స్ అప్రమత్తత వల్ల ఆ కుట్ర బయటపడటం తెలిసిందే. ఇక తమిళనాడుకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులు దాదాపు 30 ఏళ్లుగా తప్పించుకుని తిరుగుతూ, అన్నమయ్య జిల్లా రాయచోటిలో పట్టుబడటంతో పోలీసులు హైఅలర్ట్ అయ్యారు. తమిళనాడు పోలీసులు ఇచ్చిన సమాచారంతో ఈ కేసుపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేశారు. రాయచోటిలో ఉన్న ఇద్దరు ఉగ్రవాదులు పేలుళ్లతో దేశంలో అల్లకల్లోలం సృష్టించేందుకు కుట్ర పన్నారని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ వెల్లడించారు.

రాయచోటిలో ఉగ్రవాదులు అబూబకర్ సిద్ధిఖీ, మహ్మద్ అలీని పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. తమిళనాడు ఇంటెలిజెన్స్ ఇచ్చిన సమాచారంతో అన్నమయ్య జిల్లా పోలీసులు చాకచక్యంగా ఇద్దరు ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఉగ్రవాదుల నుంచి సంచలన




సమచారం పోలీసులు సేకరించినట్లు డీఐజీ కోయ ప్రవీణ్ ప్రకటించారు. ఆల్ ఉమ్మా అనే ఉగ్రవాద సంస్థకు చెందిన ఉగ్రవాదులు దేశంలో మూడు ప్రధాన నగరాలులో పేలుళ్లకు కుట్ర పన్నినట్లు డీఐజీ ప్రవీణ్ తెలిపారు. దక్షిణ భారత దేశంలోనే పెద్ద ఉగ్రవాద సంస్థ అయిన ఆల్ ఉమ్మా ఐసిస్ ఉగ్రవాద సంస్థ ఆలోచనల ప్రకారం నడుస్తుందని పోలీసులు చెబుతున్నారు.

రాయచోటిలో పట్టుబడిన ఇద్దరు ఉగ్రవాదులకు సహకరిస్తున్న వారు ఎవరు? వారికి స్థానికంగా ఎవరైనా అనుచరులు ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఉగ్రవాదుల నుంచి 50 ఐఈడీ బాంబుల తయారీకి ఉపయోగపడే మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు డీఐజీ వెల్లడించారు. ఈ కేసును అన్ని విధాలుగా దర్యాప్తు చేస్తున్నట్లు డీఐజీ వెల్లడించారు. ఉగ్రవాదులు స్థానికంగా కొందరిని రిక్రూట్ చేసుకుని శిక్షణ ఇచ్చారనే అనుమానాలను నిర్ధారించుకోవాల్సివుందని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదులకు పేలుడు పదార్థాలు ఎక్కడి నుంచి వచ్చాయనే విషయమై ప్రస్తుతం ఆరా తీస్తున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఇంటెలిజెన్స్ సంస్థల సహకారం తీసుకుంటున్నామని, ఉగ్రవాదుల కుటుంబ సభ్యుల పాత్రపైనా కొన్ని అనుమానాలు ఉన్నాయని డీఐజీ తెలిపారు. అబూబకర్ సిద్ధిఖీ భార్య షేక్ సైరాభాను, మహ్మద్ అలీ భార్య షేక్ షమీమ్‌లపై కూడా కేసులు నమోదు చేసినట్టు వివరించారు. వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించిందన్నారు. వారిని కడప కేంద్ర కారాగారానికి తరలించామన్నారు డీఐజీ. ఇక ఉగ్రవాదులు ఇద్దరికీ సాంకేతిక నైపుణ్యం ఉందని చెబుతున్నారు. రాయచోటిలో స్థిరపడిన వీరు 2013లో బెంగళూరులోని మల్లేశ్వరంలో పేలుళ్లకు సహకరించినట్లు దర్యాప్తులో వెల్లడైందని అంటున్నారు.

# తెలంగాణ మంత్రివర్గం.. కొత్తగా ఎవరికీ చాన్స్ లేదు.. తేల్చేసిన ఖర్గే



**హైదరాబాద్ పెన్ పవర్:**దాదాపు ఏడాదిన్నర అవుతోంది తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి... మొన్నటికి ఎట్టకేలకు మంత్రివర్గ విస్తరణ జరిగింది. కేవలం ముగ్గురికి మాత్రమే చోటు దక్కింది. ఇంకా హైదరాబాద్, రంగారెడ్డి వంటి ప్రముఖ జిల్లాలకే కాదు.. నిజామాబాద్ జిల్లాకూ మంత్రి లేరు. ఉమ్మడి మహబూబ్ నగర్ కు మాత్రం సీఎంతో పాటు ఇద్దరు మంత్రులు ఉన్నారు. తెలంగాణ క్యాబినెట్ లో ఇంకా మూడు ఖాళీలు ఉన్నాయి. మరి వీటిని భర్తీ చేసేది ఎప్పుడు..? మిగతా మూడు జిల్లాలకు అవకాశం దక్కేది ఎప్పుడు..? అలాగని ప్రతిసారీ ఢిల్లీకి వెళ్లి అధిష్ఠానాన్ని కలిసే అవకాశం ఉండదు. ఆ అధిష్ఠానమే హైదరాబాద్ కు వస్తే.. ఇంకేముంది.. మంత్రి పదవులు ఆశిస్తున్న నాయకులంతా ఆయన ముందు క్యూ కట్టారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ వచ్చారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. ముఖ్యనేతలతో ఆయన సమావేశం అవుతున్నారు. తాజా పరిణామాలను తెలుసుకుంటూనే పార్టీని పటిష్ఠం చేసేందుకు సూచనలు ఇచ్చారు. నాయకులను కూడా కలుస్తున్నారు. ఇదే అవకాశం కొందరు మంత్రి పదవి ఆశావభహులు ఖర్గేను కలిసి తమ అవకాశాలు, బలాల గురించి వివరించారు. సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను ప్రస్తావించారు. అయితే, అందరూ చెప్పేది విన్న ఖర్గే.. అసలు పార్టీ వైఖరి ఏమిటో కూడా స్పష్టం చేశారు.

**బంధువులూ దూరమయ్యారు..**

ఖర్గే ముఖాముఖి కలిసిన వారిలో ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, నిజామాబాద్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, హైదరాబాద్ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రంగారెడ్డి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, బాలూనాయక్ ఉన్నారు.

ఆదిలాబాద్ జిల్లాలో పార్టీ కోసం ఎంతో కష్టపడ్డానని, సొంత బంధువులతోనూ వైరం వచ్చిందని, రేవంత్ టీపీసీసీ చీఫ్ గా ఉన్న సమయంలో ఇంద్రవెల్లిలో సభతో పార్టీకి ఊపు తెచ్చానని అప్పుడే తనకు మంత్రి పదవి హామీ ఇచ్చారని ప్రేమ్ సాగర్ రావు గుర్తు చేశారు. ఎన్నికల ముందు వచ్చినవారికి మంత్రి పదవి ఇచ్చి తనను దూరం పెట్టారని ఆయన వాపోయినట్లు సమాచారం.ఇక తెలంగాణకు గుండెకాయ అయిన హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు ఒక్క మంత్రి పదవీ లేకపోవడం సరికాదని, ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. గిరిజనులకు అన్యాయం జరిగిందని బాలూనాయక్ వాపోగా.. తనకూ చాన్స్ ఇవ్వాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి నివేదికనే అందజేసినట్లు చెబుతున్నారు.

అయితే, అందరి అభిప్రాయాలు విన్న ఖర్గే.. ప్రస్తుతం ఉన్న క్యాబినెట్ స్వరూపం గురించి ఆరా తీశారు. ఎవరికీ మంత్రి పదవి హామీ ఇవ్వకుండానే.. బీఆర్ఎస్, బీజేపీ సామాజిక సమీకరణాలను అడిగి తెలుసుకున్నారు.కూర్పులో భాగంగా రెడ్డి సామాజికవర్గానికి మంత్రి పదవి అవకాశం లేదనే అభిప్రాయం వ్యక్తమైనట్లు సమాచారం. అంతేగాక ఇప్పట్లో విస్తరణ కూడా లేదనే సంకేతాన్ని ఖర్గే వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు.

## ట్యూషన్ లొల్లి.. 57వ అంతస్తు నుంచి దూకి సూసైడ్ చేసుకున్న నటి కొడుకు



**హైదరాబాద్ పెన్ పవర్:**అనూహ్య విషాద ఘటన ఒకటి ముంబయి లో చోటు చేసుకుంది. ట్యూషన్ కు వెళ్లే అంశంపై గొడవ పడిన పద్నాలుగేళ్ల బాలుడు ఇంటి నుంచి బయటకు వచ్చి.. 57వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న వైనం షాకింగ్ గా మారింది. వ్యక్తిగత గోప్యతలో భాగంగా సదరు మైనర్ తల్లి వివరాల్ని వెల్లడించటం లేదు.అయితే.. ఆమె ఎవరో కాదని.. ప్రముఖ టీవీ నటిగా చెబుతున్నారు. పేరును మాత్రం వెల్లడించటం లేదు. భర్తతో విడిపోయి కొడుకుతో కలిసి ఉంటున్న ఆమె.. తాజాగా ట్యూషన్ కు వెళ్లే అంశంపై తల్లి.. కొడుకులు ఇద్దరు వాదన చేసుకున్నట్లుగా చెబుతున్నారు. గురువారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో ముంబయిలోని కాందివలి వెస్ట్ ప్రాంతంలోని సీ బ్రూక్ అనే హైరేజ్ అపార్టుమెంట్ లో ఈ విషాద ఉదంతం చోటు చేసుకుంది. కాస్త ఆలస్యంగా ఈ ఉదంతం బయటకు వచ్చింది.ట్యూషన్ కు వెళ్లేందుకు కొడుక్కి సుతారం ఇష్టం లేదని.. కానీ.. సదరు నటి మాత్రం కొడుకును ట్యూషన్ కు వెళ్లాల్సిందేనంటూ గట్టిగా చెప్పటం.. ఇరువురి మధ్య చోటు చేసుకున్న వాదనలో సదరు బాలుడు 57వ అంతస్థు నుంచి దూకి సూసైడ్ చేసుకున్నట్లు చెబుతున్నారు. బాలుడి సూసైడ్ అటెంప్టు ను గుర్తించిన పొరుగున ఉన్న ఫ్లాట్ లోని వ్యక్తి సదరు నటికి సమాచారం ఇచ్చినట్లుగా తెలుస్తోంది.ఈ ఉదంతంలో ఎలాంటి అనుమానాలకు తావు లేదని చెబుతున్నారు. సదరు టీవీ నటికి బాలుడు ఒక్కరే సంతానంగా చెబుతున్నారు. పలు హిందీ.. గుజరాతీ సీరియళ్లలో నటించిన ఆమె పాపులర్ నటిగా పేరుంది. చదువులో ఒత్తిడే ఆత్మహత్యకు పురిగొల్పిందా? అన్న అంశంపై పోలీసులు విచారిస్తున్నారు ఆత్మహత్య చేసుకున్న బాలుడి తల్లి.. స్కూల్ టీచర్లు.. సదరు కుటుంబానికి సన్నిహితంగా ఉండే వారిని విచారించి.. బాలుడి ఒత్తిడికి కారణం ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేస్తామని చెబుతున్నారు.

## డ్రైవింగ్ లైసెన్సు లేదా.. అయితే జీతం కట్.. తాడిపత్రిలో జేసీ సంచలన నిర్ణయం



**హైదరాబాద్ పెన్ పవర్:**తాడిపత్రి మున్సిపల్ చైర్మన్, సీనియర్ తెలుగుదేశం నేత జేసీ ప్రభాకర్ రెడ్డి ఓ షాకింగ్ నిర్ణయం తీసుకున్నారు. ఎప్పుడూ హాట్ కామెంట్లతో పతాక శీర్షికల్లో నిలిచే జేసీ తాజా నిర్ణయం మాత్రం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రజా ప్రతినిధిగా ఆయన తీసుకున్న చర్యపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తన మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల క్షేమం కోరి జేసీ తీసుకున్న నిర్ణయం ఆదర్శనీయమని అంతా అంటున్నారు. అయితే ఆ నిర్ణయం తీసుకోడానికి జేసీ అనుసరించిన పద్ధతి మాత్రం విమర్శలకు తావిస్తోందని అంటున్నారు.దూకుడు రాజకీయం, ఘాటు విమర్శలతో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రత్యేకత చాటుకుంటుంటారు. తన రాజకీయ ప్రత్యర్థి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డితో వ్యక్తిగత వైరం పెట్టుకున్న ఈ మధ్య రచ్చరచ్చ చేశారు జేసీ. అదేవిధంగా ఈ ఏడాది ప్రారంభంలో బీజేపీ మహిళా నేతలపై ఆయన చేసిన కామెంట్లు పెద్ద దుమారమే రేపాయి. మరోవైపు ప్రతిపక్షం వైసీపీపై తరచూ పరుష వ్యాఖ్యలతో ఆయన విమర్శల దాడి చేస్తూనే ఉంటారు. ఇక నిన్న కాక మొన్న తాడిపత్రి మాజీ డీఎస్పీ చైతన్యను వదిలిపెట్టేది లేదన్న వార్నింగుతో కాక రేపారు. ఇలా నిత్యం అగ్గి రగుల్చుతూ రాజకీయంగా వాడివేడిగా సాగే జేసీ ప్రభాకర్ రెడ్డి ఆకస్మాత్తుగా తన దృష్టి తాడిపత్రి మున్సిపల్ ఉద్యోగులపైకి మళ్లించారు.

తాడిపత్రి మున్సిపాలిటీతో పాటు వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిలో ఎంత మందికి డ్రైవింగు లైసెన్సులు ఉన్నది తెలుసుకోవాలని భావించిన జేసీ ప్రభాకర్ రెడ్డికి మతిపోయినంత పనైందని చెబుతున్నారు. 18 ఏళ్ల లోపు వయసు వారికి ద్విచక్ర వాహనాలు ఇస్తే నిబంధనల ప్రకారం తల్లి దండ్రులకు జైలు శిక్షలు వేయొచ్చని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. దీంతో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ హోదాలో తన బిడ్డలు లాంటి సిబ్బందిలో ఎంతమందికి లైసెన్సులు ఉన్నాయో లేవో తెలుసుకోవాలని ప్రత్యేక సర్వే చేయించారట జేసీ. ఇందులో కేవలం 30 శాతం మందికి మాత్రమే లైసెన్సులు ఉన్నాయని, 70 శాతం మంది లైసెన్సులు లేకుండానే మోటారు సైకిల్లతో తిరుగుతున్నారని గ్రహించారు.లైసెన్సు లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడాన్ని తీవ్ర నేరంగా పరిగణించిన జేసీ మున్సిపల్ చైర్మన్ గా సంచలన నిర్ణయం తీసుకున్నారు. లైసెన్సులు లేని మున్సిపల్, వార్డు సచివాలయ సిబ్బంది 84 మందికి ఈ నెల జీతాలు నిలిపివేసినట్లు జేసీ స్వయంగా ప్రకటించారు. వీరందరికీ ఐదు రోజులు సమయం ఇచ్చారు. ముందుగా డ్రైవింగ్ లెర్నర్ లైసెన్సు తీసుకోవాలని, అలా ఎల్ఎల్ఆర్ తీసుకున్నవారికి 6వ తేదీన జీతాలు చెల్లిస్తానని వెల్లడించారు. అంతేకాకుండా ఎల్ఎల్ఆర్ తీసుకున్న సిబ్బంది నెక్ట్స్ మంత్ పూర్తి స్థాయి డ్రైవింగు లైసెన్సును మున్సిపాలిటీలో చూపించాల్సివుంటుంది. అప్పుడే ఆ నెల జీతం చెల్లిస్తారు. జేసీ తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈ నెల ఎల్ఎల్ఆర్ తీసుకోని వారికి జీతం కట్ అయిపోయినట్లేనని అంటున్నారు.జీతాలు నిలిపివేయడం, డ్రైవింగు లైసెన్సులు తీసుకోమని సూచించడమే కాకుండా, కలెక్టర్, జిల్లా రవాణా అధికారితో మాట్లాడి తాడిపత్రి మున్సిపల్, వార్డు సచివాలయ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా డ్రైవింగ్ లైసెన్సు మేళా నిర్వహించాలని కూడా కోరుతున్నారు జేసీ ప్రభాకర్ రెడ్డి. ఉద్యోగుల సంక్షేమం కోసం ఆయన తీసుకున్న చర్య అభినందనీయమైనా, జీతాలు నిలిపివేయడంపైనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే నిర్ణయం తీసుకున్నది మొండి ఘటం జేసీ కనుక ఎవరూ పల్లెత్తి మాట్లాడటం లేదని అంటున్నారు. పెద్దాయన మొండిపట్టు తెలిసిన ఉద్యోగులు లైసెన్సుల కోసం రవాణా కార్యాలయానికి పరుగు తీస్తున్నట్లు సమాచారం.

# విమాన ప్రమాదం: పరిహారంలో ట్విస్ట్.. బాధిత కుటుంబాల ఆవేదన

**హైదరాబాద్ పెన్ పవర్:**జూన్ 12న జరిగిన దురదృష్టకర విమాన ప్రమాదం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్‌ఇండియా విమానం టేకాఫ్ అయిన కొద్ది సమయానికే కుప్పకూలడంతో 242 మంది ప్రయాణికుల్లో ఒక్కరు మినహా అందరూ మరణించారు. ఈ దుర్ఘటనలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్ పౌరులు, 7 మంది పోర్చుగీస్ జాతీయులు, ఒక కెనడా పౌరుడు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదంలో మునిగిపోయిన బాధిత కుటుంబాలు ప్రస్తుతం పరిహారం విషయంలో ఎదురవుతున్న కొన్ని ప్రశ్నలతో మరింత ఆవేదన చెందుతున్నారు.



**ఎయిరిండియాకు ఆర్థిక వివరాలు ఎందుకని?**

ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ఎయిరిండియా ?25 లక్షల చొప్పున తాత్కాలిక సహాయాన్ని ప్రకటించింది. పూర్తి పరిహారం కింద ?1 కోటి చొప్పున చెల్లింపు చేస్తామని కూడా తెలిపింది. అయితే, ఈ చెల్లింపుల కోసం బాధిత కుటుంబాల నుండి ఆర్థిక వివరాలను కోరుతున్నట్లు వార్తలు వెలువడ్డాయి. బ్రిటన్‌కు చెందిన న్యాయసంస్థ స్టీవర్ట్స్ వెల్లడించిన ప్రకారం.. ఎయిరిండియా పంపిన ప్రశ్నావళిలో, దరఖాస్తుదారులు మృతిచెందిన వారిపై ఆర్థికంగా ఆధారపడి ఉన్నారా? అనే ప్రశ్న కూడా ఉందని, ఇది బాధిత కుటుంబాలను మరింత మానసిక క్షోభకు గురిచేస్తోందని ఆ సంస్థ వాపోయింది. ఈ వివరాలు అందించకపోతే పరిహారం ఇవ్వడం కష్టమని కూడా సూచించినట్లు సమాచారం.

**బాధితుల ఆవేదన.. న్యాయబద్ధతపై ప్రశ్నలు**

ఈ పరిస్థితిపై బాధిత కుటుంబాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. “మేము మా ప్రియమైన వారిని కోల్పోయాం, తీవ్రమైన మనోవేదనలో ఉన్నాం. ఇలాంటప్పుడు మా ఆర్థిక పరిస్థితుల గురించి అడగడం ఎంతవరకు న్యాయం?” అని ప్రశ్నిస్తున్నారు. ఆర్థిక అవసరాల నిమిత్తమే చెల్లింపులు ఇస్తామంటే, అది కేవలం ఒక లావాదేవీలా మారిపోతుందని, మానవతా దృక్పథం కొరవడుతుందని వారు భావిస్తున్నారు.

**ఎయిరిండియా స్పందన.. ఆరోపణలు నిరాధారం**

ఈ ఆరోపణలపై ఎయిరిండియా స్పందించింది. తమపై వచ్చిన ఆరోపణలు నిరాధారమని, అవాస్తవమని స్పష్టం చేసింది. “ప్రశ్నావళిలోని వివరాలు మృతులతో దరఖాస్తుదారుల బంధాన్ని తెలుసుకోవడం కోసం మాత్రమే. అది తాత్కాలిక చెల్లింపుల ప్రక్రియను సమర్థవంతంగా చేసేందుకు అవసరం. బాధిత కుటుంబాలకు మేము తగినంత సమయం ఇస్తున్నాం. వారి పక్షాన మేము అండగా ఉంటాం” అని ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే 47 కుటుంబాలకు తాత్కాలిక సహాయం అందించినట్లు సంస్థ వెల్లడించింది.

**బాధితులకు సరైన సహాయం అవసరం**

ఇలాంటి విషాద సమయంలో బాధిత కుటుంబాలకు న్యాయమైన, మానవీయ దృష్టితో ఆదరణ కల్పించడం అత్యవసరం. వారి గోప్యతను, ఆవేదనను గౌరవించాల్సిన బాధ్యత ఎయిరిండియా వంటి సంస్థలపై ఉంటుంది. ప్రశ్నావళులు, ధ్రువీకరణలతో కాకుండా, నేరుగా మానవతా దృష్టితో ముందుకెళ్లే విధానాన్ని అవలంబించాల్సిన అవసరం ఎంతో ఉంది. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు పరిహారం ఇవ్వడమంటే కేవలం ఆర్థిక లావాదేవీ కాదు. అది బాధను పంచుకోవడం, వారి పట్ల బాధ్యతను నిరూపించుకోవడం. ఈ విషయంలో విమానయాన సంస్థలు మరింత సున్నితంగా, బాధితుల మనోభావాలను గౌరవిస్తూ ముందుకు సాగాలని నిపుణులు సూచిస్తున్నారు.

# విమానంలో ఘోరం: ప్రయాణికుడిపై భారత సంతతి యువకుడి దాడి..

**హైదరాబాద్ పెన్ పవర్:**జూన్ 30న ఫిలడెల్ఫియా నుంచి మయామికి వెళ్తున్న ఫ్రాంటియర్ ఎయిర్‌లైన్స్ విమానంలో జరిగిన ఓ దారుణ ఘటన ప్రయాణికులను దిగ్భ్రాంతికి గురిచేసింది. గగనతలంలో విమానం సజావుగా సాగుతుందని భావించిన వారికి, భారత సంతతికి చెందిన ఇషాన్ శర్మ (21) అనే యువకుడు తోటి ప్రయాణికుడిపై దాడికి దిగిన దృశ్యం షాక్ ఇచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



న్యూయార్క్‌కు చెందిన ఇషాన్ శర్మకు, కీను ఎవాన్స్ అనే మరో ప్రయాణికుడికి మధ్య విమానంలో వాగ్వాదం తలెత్తింది. చిన్న మాటల తూకలాగా మొదలైన ఈ గొడవ క్షణాల్లోనే హింసాత్మకంగా మారింది. శర్మ ఒక్కసారిగా ఎవాన్స్‌పై దాడికి దిగి, అతని గొంతు బిగించి ఊపిరాడకుండా చేశాడు. తోటి ప్రయాణికులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా, శర్మను ఆపడం కష్టమైంది. అక్కడితో ఆగకుండా, శర్మ ఎవాన్స్ గొంతు కోయడానికి ప్రయత్నించి, శరీరంపై గాయాలు చేశాడు. ఈ ఘటనతో విమానంలోని ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. సిబ్బందికి అత్యవసర బటన్ నొక్కి సమాచారం అందించగా, విమానం మయామి విమానాశ్రయానికి చేరుకోగానే పోలీసులు శర్మను అరెస్ట్ చేశారు. ఈ దాడిలో శర్మ కంటిపై స్వల్ప గాయాలైనట్లు గుర్తించారు.

**పోలీసు విచారణ.. కోర్టు హాజరు**

దాడి చేసిన ఇషాన్ శర్మపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు ఎవాన్స్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో, తన సీటు వైపు వెళ్తుండగా శర్మ తన మెడ పట్టుకుని చంపుతానని బెదిరించాడని పేర్కొన్నాడు. విమాన సిబ్బందికి తానే సమాచారం అందించినట్లు ఎవాన్స్ తెలిపాడు.జులై 2న శర్మను కోర్టులో హాజరుపరిచారు. శర్మ తరపు న్యాయవాది మాట్లాడుతూ, “ఇషాన్ ధ్యానంలో ఉండేవాడు. అప్పుడు వెనుక ప్రయాణికుడు ఏదో అభ్యంతరం చెప్పినట్లు సమాచారం. కానీ ఇది ఓ దురదృష్టకర ఘటన మాత్రమే” అని వివరించారు.

**వైరల్ అవుతున్న వీడియోలు**

ఈ ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. గగనతలంలోనే జరిగిన ఈ హింసాత్మక ఘటనపై నెటిజన్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. “విమానాల్లో భద్రత మామూలుగా ఉండటం సరిపోదు.. మానసిక స్థితి సరిగా లేని వ్యక్తులపై ముందుగానే చర్యలు తీసుకోవాలి” అంటూ పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ఘటన మరోసారి విమాన ప్రయాణాల్లో భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలను లేవనెత్తింది. ప్రయాణికుల భద్రత కోసం విమాన సంస్థలు మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇషాన్ శర్మపై నేర విచారణ కొనసాగుతోంది.

# జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ టికెట్ మా ఇంటికే.. ఎవరీ మాగంటి వజ్రనాథ్?

**హైదరాబాద్ పెన్ పవర్:**సరిగ్గా గత నెల ఐదో తేదీన గుండెపోటుకు గురయ్యారు జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా, జూబ్లీహిల్స్ వంటి సీటును పార్టీకి కంచుకోటగా మలిచిన గోపీనాథ్ జూన్ 8న మరణించారు. దీంతో తెలంగాణలో ఉప ఎన్నిక అనివార్యం అయింది. నవంబరులోపు ఎన్నిక జరగాల్సి ఉంది. బహుశా బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో కలిపి నిర్వహిస్తారని భావించవచ్చు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సిటింగ్ స్థానం టికెట్ ను ఆశిస్తూ పలువురి పేర్లు తెరపైకి వస్తున్నాయి.దాదాపు రెండేళ్ల కిందట జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గోపీనాథ్, కాంగ్రెస్ నుంచి టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజహరుద్దీన్ ప్రధాన అభ్యర్థులుగా పోటీపడ్డారు. ఇప్పుడు బీఆర్ఎస్ టికెట్ ను మాగంటి కుటుంబ సభ్యులకే ఇస్తారు అన్న ఊహాగానాలు వస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో సిటింగ్ ఎమ్మెల్యే ఆకస్మికంగా మరణిస్తే ఉప ఎన్నికను ఏకగ్రీవం చేసేవారు. ఈ సంప్రదాయం ఇప్పుడు కొనసాగడం లేదు. కాబట్టి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యం.బీఆర్ఎస్ టికెట్ ను మాగంటి గోపీనాథ్ అన్న వజ్రనాథ్ ఆశిస్తున్నారు. తాజాగా నియోజకవర్గంలో పర్యటిస్తూ పార్టీ క్యాడర్, అభిమానులను కలుస్తున్నారు. టికెట్ ను బీఆర్ఎస్ తమ కుటుంబానికే కేటాయించిందని కూడా అంటున్నారు. ఎవరిని అభ్యర్థిగా నిలుపుతామనేది పార్టీనే నిర్ణయిస్తుందని, తాను రేసులో ఉన్నట్లుగా స్పష్టం చేశారు.జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ టికెట్ రేసులో ఉన్నట్టు ప్రకటించిన మాగంటి వజ్రనాథ్ స్వయంగా గోపీనాథ్ కు అన్న. తమ్ముడి గెలుపు కోసం పదేళ్లుగా నియోజకవర్గంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు చెబుతున్నారు. కాకపోతే అది తెరవెనుక. వ్యాపారం చూసుకుంటూనే బీఆర్ఎస్ కోసం పనిచేశారు. ఇప్పుడు తమ్ముడి స్థానంలో తానే పోటీ చేస్తానని చెబుతున్నారు.మాగంటికి జూబ్లీహిల్స్ పేద ప్రజల్లో మంచి పేరుంది. ముఖ్యంగా బస్తీల్లో ఆయన ఇమేజీ బాగుంది. ఇప్పుడు సానుభూతి పవనాలు కూడా తోడైతే... బీఆర్ఎస్ సిటింగ్ స్థానాన్ని నిలుపుకోవడం ఖాయం అని చెబుతున్నారు. అయితే, ప్రధాన పోటీదారు బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి వర్గం ఎలా స్పందిస్తుందో చూడాలి.



# మన ఆడబిడ్డ.. తెలుగింటి కోడలు.. బీజేపీ జాతీయ చీఫ్ గా మహిళ?

**హైదరాబాద్ పెన్ పవర్:**వాజ్ పేయీ, ఆధ్వాణీ వంటి దిగ్గజాలు... రాజ్ నాథ్ సింగ్, గడ్కరీ వంటి హేమాహేమీలు.. అమిత్ షా, జేపీ నడ్డా వంటి ఉద్ధండులు సారథులుగా వ్యవహరించిన బీజేపీకి కొత్తగా మహిళా అధ్యక్షురాలు రాబోతున్నారా..? 45 ఏళ్ల పార్టీ చరిత్రలో తొలిసారి ఓ మహిళను చీఫ్ ను చేయనున్నారా? అది కూడా మన తెలుగు ఆడబిడ్డ పురందేశ్వరి ఓ జాతీయ పార్టీ పగ్గాలు చేపట్టన్నారా..? లేదా తెలుగింటి కోడలు కమలం పార్టీకి కొత్త బాస్ కానున్నారా...? తాజా పరిణామాలను చూస్తే ఔననే మాటే వినిపిస్తోంది. తెలుగు నేలతో సంబంధం ఉన్న వీరిద్దరూ కాకుంటే తమిళనాడు నాయకురాలికి చాన్స్ దక్కుతుందని చెబుతున్నారు.బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ప్రస్తుతం కేంద్ర మంత్రి జేపీ నడ్డా ఉన్నారు. ఆయన పదవీ కాలం రెండేళ్ల కిందటే పూర్తయింది. కానీ, ఆయననే కొనసాగిస్తున్నారు. కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, భూపేంద్ర యాదవ్ పేర్లు గట్టిగా వినిపించినా.. నడ్డానే కొనసాగుతున్నారు. ఇప్పుడు మాత్రం కొత్త చీఫ్ ఎన్నిక తప్పదు. అది కూడా ఈ నెల రెండో వారంలోనే.మాజీ ప్రధాని వాజ్ పేయీ నుంచి ఇప్పటివరకు బీజేపీకి 11 మంది జాతీయ అధ్యక్షులుగా పనిచేశారు. వీరిలో ఆధ్వాణీ మూడుసార్లు, రాజ్ నాథ్ రెండుసార్లు చీఫ్ లుగా వ్యవహరించారు. మహిళలు ఎవరికీ ఈ బాధ్యతలు దక్కలేదు. అందుకనే ఈసారి మహిళకు పగ్గాలు ఇస్తారనే కథనాలు జాతీయ మీడియాలో వినిపిస్తున్నాయి.నిన్నటివరకు ఏపీ బీజేపీ



చీఫ్ గా ఉన్న రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో పాటు తమిళనాడుకు చెందిన వనతి శ్రీనివాసన్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. నడ్డా, బీజేపీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ లు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. అందులో వీరి పేర్లు ప్రముఖంగా వినిపించాయి. ప్రధాని మోదీ ప్రస్తుత 8 రోజుల విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన తిరిగివచ్చాక నిర్ణయం తీసుకుంటారు.పార్టీ చీఫ్ రేసులో తెలుగింటి కోడలు అయిన నిర్మల ముందంజలో ఉన్నట్లు చెబుతున్నారు. బీజేపీ మహిళా వాయిస్ ఈమె. 11 ఏళ్లు కేంద్ర మంత్రిగా అనుభవం, 2019 నుంచి ఆర్థిక శాఖను చూస్తుండడం, నాయకత్వ సామర్థ్యం రీత్యా నిర్మలకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని.. దక్షిణాదిలో పార్టీ బలోపేతానికి ఇదే మంచి మార్గం అని చెబుతున్నారు. తమిళనాడుకు చెందిన నిర్మల.. వచ్చే ఏడాది జరిగే ఆ రాష్ట్ర ఎన్నికల్లో పార్టీని ముందుండి నడిపించే చాన్స్ ఉందని అంటున్నారు. ఆర్ఎస్ఎస్ సంపూర్ణ మద్దతు ఉండడం ప్లస్ పాయింట్.

పురందేశ్వరి 2014లో బీజేపీలోకి వచ్చారు. కేంద్రమంత్రిగా పదేళ్ల అనుభవం ఉన్నా.. అది కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏలో. పదేళ్ల తర్వాత నిరుడు ఎంపీగా గెలిచారు. కేంద్ర మంత్రివర్గంలో చోటు ఖాయం అని పలుసార్లు ఊహాగానాలు వినిపించినా సాధ్యం కాలేదు. టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు కుమార్తెగా, హుందాతనం ఉన్న నాయకురాలిగా పేరు తెచ్చుకున్నారు. గత ఏడాది ఏపీలో టీడీపీ–జనసేన– బీజేపీ కూటమి ఏర్పాటు సమయానికి ఆమెనే ఏపీ చీఫ్. సంఘ్ నేపథ్యం లేకపోవడం ఒక్కటే మైనస్. ఒకవేళ నిర్మల బీజేపీ చీఫ్ అయితే.. ఆ స్థానంలో పురందేశ్వరి వెళ్తారని ఖాయంగా చెప్పొచ్చు.వనతి శ్రీనివాసన్.. తమిళనాడుకు చెందిన న్యాయవాది. పార్టీలో పలు పదవులు నిర్వర్తించారు. కోయంబత్తూర్ దక్షిణ ఎమ్మెల్యే. విశ్వ నటుడు కమల్ హాసన్ పై గెలిచారు. 1993 నుంచి బీజేపీలో ఉన్నారు. పక్కా తమిళ వ్యక్తి అయినందున వనతిని చీఫ్ గా చేయడం అసెంబ్లీ ఎన్నికల్లో మేలు చేస్తుందని బీజేపీ ఆలోచించవచ్చు. ఐదేళ్ల కిందటే మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు కావడం.. మూడేళ్ల నుంచి కేంద్ర ఎన్నికల కమిటీలో ఉండడం వనతికి ప్లస్ పాయింట్స్. బీజేపీలో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా.. దానికి ఆర్ఎస్ఎస్ ఆమోదం అవసరం. అయితే, మహిళను అధ్యక్షురాలిగా చేసేందుకు ఆర్ఎస్ఎస్ ఓకే చెప్పినట్లు కూడా సమాచారం. బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఏపీ, తెలంగాణ సహా 16 రాష్ట్రాల చీఫ్ ల ఎన్నిక పూర్తయింది. జాతీయ అధ్యక్షుడి ఎన్నిక చేపట్టాలంటే కనీసం 19 రాష్ట్రాల అధ్యక్షుల నియామకం పూర్తవ్వాలి.

# నాగబాబు మంత్రి పదవి హుష్ కాకేనా?

**హైదరాబాద్ పెన్ పవర్:**జనసేన ఎమ్మెల్సీ నాగబాబుకు మంత్రి పదవి దక్కే అవకాశం కనిపించడం లేదు. ఆయనకు మంత్రి పదవి వస్తుందని అందరూ భావించారు. అంతకు ముందయితే నాగబాబుకు శాఖలను కేటాయిస్తూ కూడా పెద్దయెత్తున ప్రచారం జరిగింది. అయితే ఇప్పటి వరకూ నాగబాబుకు మంత్రిపదవి ఊసే ఇప్పుడు వినపడటకపోవడం వెనక అనేక కారణాలున్నాయని అంటున్నారు. ఎమ్మెల్సీ అయిన వెంటనే నాగబాబును మంత్రి పదవిలోకి తీసుకుంటామని స్వయంగా పవన్ కల్యాణ్ తో పాటు చంద్రబాబు నాయుడు కూడా మీడియా చిట్ చాట్ లో ప్రకటించడంతో ఆయనకు మంత్రి పదవి ఖాయమనుకున్నారు. కానీ తర్వాత ఇటు చంద్రబాబు, అటు పవన్ కల్యాణ్ లు ఇద్దరూ ఈ విషయంలో కొంత ఆలోచనలో పడినట్లు సమాచారం.




**సామాజికవర్గం కూడా...**

నాగబాబుకు సినిమాటోగ్రఫీ శాఖ ఇస్తారని ప్రచారం కూడా జరిగింది. నాగబాబుకు మంత్రి పదవి ఇవ్వడం వల్ల ప్లస్ లు, మైనస్ లు బేరీజు వేసుకుంటే తీసుకోకపోవడమే మంచిదన్న నిర్ణయానికి వచ్చినట్లుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గంలో ఇంకా ఒక పదవి ఖాళీగా ఉంది. ఆ పదవిలో నాగబాబు కంటే వేరు వారికి ఇస్తే రాజకీయంగా కొంత ప్రయోజనం చేకూరుతుందని చంద్రబాబు, పవన్ కల్యాణ్ లు ఇద్దరూ భావించినట్లు తెలిసింది. నిజానికి నాగబాబుకు సామాజికవర్గం కూడా శాపంగా మారింది. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు కేబినెట్ లో జనసేన నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నారు. పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ లు ఉన్నారు. అందులో నాదెండ్ల మనోహర్ మినహాయిస్తే మిగిలిన ఇద్దరు కాపు సామాజికవర్గానికి చెందిన వారు. నాగబాబుకు కూడా పదవి ఇస్తే నలుగురిలో ముగ్గురు కాపు సామాజికవర్గానికి చెందిన వారికి మంత్రి పదవులు ఇచ్చినట్లవుతుంది.

**కాపుల్లో అసంతృప్తి...**

అలాగే తెలుగుదేశం పార్టీలో నూ కాపు సామాజికవర్గానికి చెందిన ఇద్దరికి టీడీపీ కూడా మంత్రి పదవులు ఇచ్చింది. పొంగూరు నారాయణ, నిమ్మల రామానాయుడు కూడా కేబినెట్ లో ఉండటంతో ఎక్కువ మంది కాపులకు కేబినెట్ లో అవకాశం ఇచ్చినట్లవుతుందన్న భావన కలుగుతుందని చంద్రబాబు నాయుడు కూడా పవన్ తో చెప్పినట్లు తెలిసింది. తెలుగుదేశం పార్టీలోనూ కాపు సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు అనేక మంది మంత్రి పదవి కోసంఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో నాగబాబును మంత్రివర్గంలో తీసుకుంటే కాపు సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ఒకింత అసంతృప్తికి లోనయ్యే అవకాశముందన్న అంచనాలు కూడా మంత్రిపదవి దక్కకపోవడానికి కారణంగా చెబుతున్నారు.

**రాజకీయ నేత కాకపోవడంతో...**

నాగబాబు రాజకీయ నేత కాదు. ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశం లేదు. ప్రజల్లో నేరుగా గెలిచింది లేదు. ఇప్పటి వరకూ ఎమ్మెల్సీలకు చంద్రబాబు మంత్రివర్గంలో చోటు కల్పించలేదు. ఎమ్మెల్సీగా ఒకరికి అవకాశమిస్తే వారి నుంచి కూడా డిమాండ్ అధికమవుతుందని అంటున్నారు. సినిమా నటుడిగా ప్రజల్లోకి పెద్దగా తిరగలేని నాగబాబుకు మంత్రి పదవి ఇచ్చినందున ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువని భావించి చంద్రబాబు పవన్ కల్యాణ్ కు నచ్చ చెప్పి అంగీకరింప చేసినట్లుతెలిసింది. మంత్రి పదవి ఇస్తామని చెప్పి ఇవ్వకపోవడంతోనే నాగబాబు కూడా ఎమ్మెల్సీ పదవి వచ్చిన తర్వాత పెద్దగా యాక్టివ్ గా కనిపించకపోవడానికి కారణమిదేనని అంటున్నారు. మొత్తం మీద నాగబాబుకు మంత్రి పదవి దక్కడం ఇప్పట్లో లేనట్లే కనిపిస్తుంది.

# ఫ్రెషర్లకు చెన్నై.. జీతాల్లో టాప్ హైదరాబాద్

హైదరాబాద్ పెన్ పవర్:జాబ్ లో చేరే వారికి ఏ నగరం అనువుగా ఉంది? ఎక్కడ ఎక్కువగా అవకాశాలు లభిస్తున్నాయి? అనుభవం ఉన్నోళ్లకు ఏ సిటీలో ఎక్కువగా జీతాలు వస్తున్నాయి? ఏ నగరంలో జీవన వ్యయం ఎక్కువగా ఉంటోంది? అందరికి అనువుగా ఉన్న మహానగరం దేశంలో ఏది? కొలువులో చేరిన తర్వాత వేతనాల పెరుగుదల.. ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఏయే నగరాల్లో ఎక్కువ? లాంటి ప్రశ్నలకు తాజాగా విడుదలైన ఇండీడ్ పే మ్యాప్ సర్వే రిపోర్టు సమాధానాల్ని చెబుతోంది.

ఈ సర్వే రిపోర్టును ఆషామాషీగా తయారు చేయలేదు. దేశ వ్యాప్తంగా 1300 మంది కంపెనీ యజమానులు.. 2500 మంది ఉద్యోగుల అభిప్రాయాల్ని సేకరించారు. అంతేకాదు.. ఉద్యోగులకు ఇచ్చే జీతాలు.. ఉద్యోగ అవకాశాలు.. వివిధ పరిశ్రమలు.. వివిధ రంగాలతో పాటు.. జీవన వ్యయం మీదా ఫోకస్ చేశారు. ఈ రిపోర్టులోని కీలక అంశాల్ని చూస్తే.. చదువులు పూర్తై.. ఉద్యోగ అవకాశాల కోసం చూస్తున్న వారికి అనువుగా చెన్నై మహానగరం ఉంటే.. ఉద్యోగంలో అనుభవం ఉండి.. మరింత ఎక్కువ అవకాశాలు.. మంచి జీతం కావాలంటే మాత్రం హైదరాబాద్ మహానగరం టాప్ లో ఉన్నట్లుగా తేలింది. ఈ రెండు నగరాలతో పాటు అహ్మదాబాద్ కూడా అగ్రస్థానంలోనే ఉన్నట్లు రిపోర్టు వెల్లడించింది. ఈ మూడు నగరాలు ఢిల్లీ.. ముంబయిలను దాటి ముందుకు వెళ్లినట్లుగా తేల్చారు. కొత్తగా ఉద్యోగంలో




చేరే వారికి చెన్నై సౌకర్యవంతంగా ఉండటమే కాదు.. ఫ్రెషర్లకు నెలకు సగటున రూ.30,100 జీతం వస్తోందని.. రెండో స్థానంలో హైదరాబాద్ ఉందని చెబుతున్నారు. ఈ సిటీలో మాత్రం ఫ్రెషర్లకు రూ.28,500 జీతం ఉన్నట్లు చెబుతున్నారు.

ఉద్యోగంలో ఒక మోస్తరు అనుభవం (కనీసం 2-5 ఏళ్లు) ఉన్న వారికి హైదరాబాద్ ది బెస్ట్ అని చెబుతున్నారు. ఇలాంటి వారికి హైదరాబాద్ లో నెలకు సగటున రూ.47,200 వరకు వస్తుందని అంచనా వేశారు. ఇక ఐదేళ్ల నుంచి ఎనిమిదేళ్ల అనుభవం ఉన్న వారికి మాత్రం రూ.69,700 వరకు జీతం వస్తోందని వెల్లడైంది. జీతాలు ఎక్కువగా ఉండే నగరాల్లో హైదరాబాద్ తర్వాత చెన్నై.. అహ్మదాబాద్ నగరాలు ఉన్నట్లుగా చెబుతున్నారు. టెక్నాలజీ.. డిజిటల్ రంగాల్లో కెరీర్ ముందుకు వెళ్లాలంటే మాత్రం ఈ మూడు నగరాలు (హైదరాబాద్, చెన్నై, అహ్మదాబాద్) బెస్టు అంటున్నారు.

ఏయే రంగాల వారికి ఎక్కువ జీతాలు ఎక్కువగా వస్తున్నాయన్న అంశాన్ని సర్వే రిపోర్టు వెల్లడించింది. ఐటీ.. తయారీ.. టెలికం రంగాలకు చెందిన వారికి ఎక్కువ జీతాలు వస్తున్నాయని.. ప్రొడక్టు.. ప్రొడెక్టు మేనేజ్ మెంట్ విభాగాల్లో గరిష్ఠ వేతనాలు లభిస్తున్నట్లుగా వెల్లడైంది. వెబ్ సైట్లు.. యాప్ లు రూపకల్పన చేసే ఉద్యోగాల్లోని నిపుణులకు ఐటీ డెవలపర్లతో సమానంగా వేతనాలు వస్తున్నట్లు తెలిపారు. ఆసక్తికరమైన మరో అంశం ఏమంటే.. ఒకప్పటి మాదిరి పెద్ద నగరాలు.. పేరు మోసిన సిటీస్ లోనే ఉద్యోగాలు పరిమితం కావటం లేదని.. దేశంలోని ఇతర నగరాలు కూడా ఉద్యోగ. ఉపాధి కేంద్రాలుగా మారుతున్నట్లుగా వెల్లడైంది.

అంతకంతకూ పెరుగుతున్న జీవన వ్యయానికి తగ్గట్లు. కంపెనీలు ఇస్తున్న జీతాలు సరిపోతున్నాయా? అని ప్రశ్నిస్తే మాత్రం.. 69 శాతం మంది తమ జీతాలు సరిపోవటం లేదని చెబుతున్నారు. ఇలా చెప్పిన వారిలో 96 శాతం మంది ఢిల్లీకి చెందిన వారు ఉండటం గమనార్హం. ఆ తర్వాతి స్థానంలో ముంబయి (95 శాతం).. పుణెలో (94 శాతం). బెంగళూరులో (93 శాతం) ఉన్నాయి. జీవన వ్యయం భరించలేనంత ఎక్కువగా మారటంతో గ్రామాలు.. పట్టణాల నుంచి ఎక్కువ మంది నగరాలకు రావటం లేదని అభిప్రాయపడుతున్నట్లు రిపోర్టు వెల్లడించింది.

## కవిత పట్టు వదిలేట్లు లేదే? పార్టీకి ఏ మేరకు లాభం?




హైదరాబాద్ పెన్ పవర్:బీఆర్ఎస్ లో కల్వకుంట్ల కవిత తుపాను కొనసాగుతూనే ఉంది. నిత్యం ఏదో ఒక కాంట్రవర్సీ కామెంట్స్ చేస్తూ ఆమె అయితే వార్తల్లో ఉంటున్నారు కానీ పార్టీ మాత్రం బద్నాం అవుతుంది. కల్వకుంట్ల కవిత అసంతృప్తి ఇప్పట్లో చల్లారేట్లు కనిపించడం లేదు. సొంత సోదరుడు కేటీఆర్ ను ఆమె లక్ష్యంగా చేసుకుని చేస్తున్న కామెంట్స్ పార్టీ క్యాడర్ ను కూడా కొంత ఆవేదనకు గురి చేస్తున్నాయి. కల్వకుంట్ల ఇంట్లో ఈ విభేదాలు ఎవరూ ఊహించనవి. కేటీఆర్, కవిత, హరీశ్ రావు అందరూ కలిసి కేసీఆర్ కు అండగా ఉంటారని అనుకున్నారు. కానీ ఇప్పుడు కవిత చేస్తున్న కామెంట్స్ తో పాటు కేటీఆర్ మొండిపట్టు పట్టడం వంటివి చూస్తుంటే రాను రాను ఈ వివాదం మరింత ముదురుతుందని, సద్దుమణిగే అవకాశాలు లేవన్నది స్పష్టంగా తెలుస్తుంది.

**ఫోన్ ట్యాపింగ్ లోనూ...**

కల్వకుంట్ల కవిత తన ఫోన తో పాటు తనఇంట్లో వారి ఫోన్లు కూడా గత ప్రభుత్వంలో ట్యాప్ అయినట్లు అనుమానం వ్యక్తం చేయడంతో అధికార కాంగ్రెస్ పార్టీ చేస్తున్న వాదనకు ఊతమిచ్చినట్లయింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేరు నేరుగా ప్రస్తావించకపోయినప్పటికీ ఆయనతో పాటు మరికొందరు కుటుంబ సభ్యులను కూడా టార్గెట్ చేసినట్లు కనపడుతుంది. కేసీఆర్ పక్కనే కోటరీలాగా మారి ఆయనను తప్పుదోవ పట్టిస్తున్నారని కవిత పదే పదే ఆరోపిస్తున్నారు. సంతోష్ రావు గురించి కవిత ఈ వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. ఇక కవిత చేసిన వ్యాఖ్య కూడా పార్టీలోనే కలకలం రేపేదిగా ఉంది. ఎప్పటికైనా తాను ముఖ్యమంత్రిని అవుతానని ఆయన అన్నమాట ఇప్పుడు గులాబీ పార్టీలో గుబులుపుట్టిస్తున్నాయి.

**అసలు టార్గెట్ ...**

కల్వకుంట్ల కవిత అసలు టార్గెట్ ముఖ్యమంత్రి అన్నట్లుగానే మాట్లాడటంతో ఇంక వివాదం మరింత పీక్స్ కు చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇంటిపోరు కారు పార్టీలో ఇబ్బందిగా మారిందని సోషల్ మీడియాలో గులాబీ పార్టీకి చెందిన కార్యకర్తలే కామెంట్స్ చేస్తున్నారు. ఈ వివాదాలకు ఫుల్ స్టాప్ పెట్టి పార్టీని అధికారంలోకి తెచ్చే ప్రయత్నం చేయాలని, ఇలాగే కుటుంబంలో వివాదాలు కొనసాగితే కాంగ్రెస్ కు మరోసారి అవకాశం చేజేతులా ఇచ్చినట్లవుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇటు కవిత అటు కేటీఆర్ ఇద్దరూ ఎవరు చెప్పినా వినే పరిస్థితుల్లో లేకపోవడంతో ఇప్పుడప్పుడే ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పడే అవకాశం కనిపించడం లేదని స్పష్టంగా తెలిసింది.

## ఏమిటీ నేరాలు.. ఘోరాలు.. చిన్న విషయాలకే ప్రాణాలు తీసుడా?

హైదరాబాద్ పెన్ పవర్:అవును.. దేశానికి ఏమైంది? ఇటీవల కాలంలో వెలుగు చూస్తున్న నేరాలు.. ఘోరాల్ని చూస్తే నోట మాట రాని పరిస్థితి. చిన్న విషయాలకు పగ పెంచుకొని ప్రాణాలు తీయటం.. లేదంటే ప్రాణాలు తీసుకోవటం లాంటివి చోటు చేసుకుంటున్నాయి. ఇది ఒక ప్రాంతానికో.. ఒక రాష్ట్రానికో పరిమితం కాకుండా దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ఇలాంటి తీరు ఉండటం ఆందోళన కలిగించే అంశం. ఒకే రోజు దేశంలోని వివిధ ప్రాంతాల్లో వెలుగు చూసిన సంచలన దారుణాల్ని చూస్తే.. దేశంలో నేరాల తీరులోనే కాదు తీవ్రతలోనూ తేడా కొట్టొచ్చినట్లుగా కనిపించకమానదు. దేశ రాజధాని ఢిల్లీలో తల్లీబిడ్డల జంట హత్యలు షాక్ కు గురి చేసేలా మారాయి. ఈ జంట హత్యలకు కారణం మీద పోలీసులు విచారణ చేపట్టగా వెలుగు చూసిన విషయాలు నోట మాట రాని విధంగా ఉండటం గమనార్హం. ఢిల్లీలోని లజపత్ నగర్ లో కుల్ దీప్ సేవాని వస్త్ర వ్యాపారం చేస్తుంటారు. అతడి దగ్గర బిహార్ కు చెందిన 24 ఏళ్ల ముకేశ్ కుమార్ డ్రైవర్ కం హెల్పర్ గా పని చేస్తుంటాడు. కొంతకాలం క్రితం యజమాని వద్ద ముకేశ్ రూ.40 వేలు అప్పు తీసుకున్నాడు. డబ్బులు తిరిగి ఇవ్వలేదు. దీంతో.. ఆగ్రహించిన కుల్ దీప్ సతీమణి రుచిక అందరి ముందు ముకేశ్ ను తిట్టింది. దీంతో కక్ష కట్టిన ముకేశ్.. యజమాని ఇంట్లో లేనప్పుడు ఇంటికి వెళ్లి రుచిక.. ఆమె పద్నాలుగేళ్ల కొడుకును కత్తితో గొంతు కోసి చంపాడు. షాప్ నుంచి ఇంటికి వచ్చిన కులదీప్.. గేటుకు తాళం వేసి ఉండటం.. మెట్లపై రక్తపు మరకలు చూసి కేకలు వేశాడు. ఎవరూ స్పందించకపోవటంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఈ జంట హత్యలు కలకలం రేపాయి. రంగంలోకి దిగిన పోలీసులు విచారణ చేపట్టారు. యజమాని సతీమణి.. కొడుకును హత్య చేసిన ముకేశ్ పారిపోయాడు. అతడ్ని ఉత్తరప్రదేశ్ లో పోలీసులు అరెస్టు చేశారు. దీంతో.. జరిగిన జంట హత్యల మిస్టరీ వీడిపోయింది.

**సోషల్ మీడియాలో పోస్టులు.. వాదనలతో మనస్తాపం.. సూసైడ్**

సోషల్ మీడియాలో పోస్టులు.. ఆపై జరిగిన వాదోపవాదాలు.. పోలీసుల ఎంట్రీ..మొత్తంగా ఒక మరణానికి కారణంగా మారాయి. ములుగు జిల్లాలోని చల్వాయి గ్రామానికి చెందిన 29 ఏళ్ల రమేశ్ హైదరాబాద్ లో ఉంటూ జాబ్ కోసం ప్రయత్నిస్తున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన అతను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేదని తెలుసుకున్నాడు. దీనిపై అధికారులు.. స్థానిక నేతల్ని కలిసినా ప్రయోజనం లేకపోయింది. చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవటంతో.. రమేశ్.. అతడి చెల్లెల్ని అమ్మమ్మ తాతయ్యల వద్ద పెరిగాడు. తమకు ఇంటిని కేటాయించకపోవటంతో గ్రామంలో ఎవరెవరికి ఇళ్లు వచ్చాయో తెలుసుకొని చల్వాయి సమాచారం అనే వాట్సప్ గ్రూపులో పోస్టు చేస్తున్నాడు. దీనిపై కాంగ్రెస్ నాయకులకు సంబంధించిన వివరాల్ని వాట్సాప్ గ్రూపులో పెట్టగా.. దీనిపై వాదోపవాదాలు జరిగాయి. దీంతో స్థానిక కాంగ్రెస్ నాయకుడు ఒకరు పోలీసులకు కంప్లైంట్ ఇవ్వగా.. వారు రమేశ్ ను హెచ్చరించారు. దీంతో మనస్తాపానికి గురైన రమేశ్ ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో.. గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

**డెలివరీ ఏజెంట్ మాదిరి వచ్చి రేప్**

పుణె మహానగరంలో షాకింగ్ క్రైం చోటు చేసుకుంది. డెలివరీ ఏజెంట్ మాదిరి ఇంటికి వచ్చిన వ్యక్తి అందులో నివాసం ఉంటున్న 22 ఏళ్ల ఐటీ ఉద్యోగినిపై రేప్ చేసిన వైనం షాకింగ్ గా మారింది. కొంధవా ప్రాంతంలో రాత్రి ఏడున్నర గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చిన వ్యక్తి ఒంటరిగా ఉన్న ఐటీ ఉద్యోగినిపై అత్యాచారానికి పాల్పడ్డాడు.